
# మినికథ



## కోడికథ

మేకా మన్మధరావు

ఉదయమే కేంప్ వెళ్ళవలసిన పని వుండటంవల్ల సూర్యుడి కంటే నేనే ముందుగా తయారయ్యాను. నేను స్నానాల గదికి వెళ్ళకముందు నుంచీ వినబడు తున్నాయి మా డాబా ఎదురుగా వున్న పాకలో అచ్చమ్మ తిట్లు. శాపనార్థాలు. మధ్య మధ్య ఏడుపు. నిన్న సాయంత్రం నుంచి తన కోడిపుంజు కనబడటం లేదు— ఇదీ దాని సారాంశం.

చదువుకుంటున్న క్లాసు పుస్తకాలు దిగువ బెట్టి. కాఫీ తాగుతున్న నా చుట్టూ చేరాయి న్నా మూడు ముత్యాలు సుధ, కవిత, సాగర్. "గుడ్ మార్నింగ్ డాడీ" అంటూ ముద్దుల ఫలహారాన్ని అందించాయి రోజూ లాగే.

"డాడీ డాడీ! పాపం ఎదురింటి అచ్చమ్మ కోడి కనబడటం లేదు డాడీ. నిన్న రాత్రి నుంచి ఏడుస్తూంది. అన్నం కూడా తినలేదట డాడీ" అంది సుధ జాలిగా.

"నౌకరు రంగన్నతో రాత్రి గార్డెనంతా వెదికించింది మమ్మీ. మేం కూడా వెదికాం. ఎక్కడా కనబడలేదు డాడీ" అంది కవిత.

"ఏమయిందో? ఎక్కడికి పోయిందో? పాపం! ఎలా డాడీ?" అన్నాడు సాగర్.

"ఏం కాదు నాన్నా! ఎక్కడికీ పోదు. అదే వస్తుంది. మీరు చదువుకోండి బై బై" అంటూ నేను జీప్ ఎక్కాను.

నేను ఈ ఊరికి ట్రాన్స్‌ఫర్ మీద వచ్చి ఒక వారం రోజులు అవుతుంది. పిల్లలు ముగ్గురికి కోళ్ళన్నా, మొక్కలన్నా మంచి సరదా. అవసరమైన సామాన్లు తెచ్చుకొనే సరికే తలప్రాణం తోకకు రావడంవల్ల. మళ్ళీ కోళ్ళూ. మొక్కలూనా అని— అవి అక్కడే వదిలించుకు వచ్చాం. మేం ఇక్కడికి వచ్చిన రెండోరోజునుంచీ మాకు ఎదురుగా వున్న పాకలో కోడిని చూసి సరదాపడ్డారు మా వాళ్ళు అది మా గార్డెన్ లోకి రావడం, వీళ్ళు ధాన్యం బియ్యం వేసి దానితో కాలక్షేపం చేయడం మొదలు. ఇది ఇలా నాలుగైదు రోజులు సాగింది. ఇప్పుడు ఆ కోడి కనబడటం లేదు. ఇదీ ఆ అచ్చమ్మ గోల, మా పిల్లల ఆవేదన.




నేను కేంప్ నుంచి వచ్చేసరికి కాస్త ఆలస్యమైంది. మాఆవిడ మాత్రమే మేల్కొని వుంది. "వాళ్ళంతా నిద్రపోయారా?" అన్నా స్నానంచేసి వళ్ళు తుడుచుకుంటూ.

"ఆ...! కోడి గురించి డిస్కస్ చేసి చేసి పడుకున్నారు" అంది భోజనం వడ్డిస్తూ.

"ఏం? దొరకలేదా?"

"ఇంకేం దొరుకుతుందండీ? ఎవరో కాజేసి వుంటారు."

"మరి మన వాళ్ళేమంటున్నారు?"

"మధ్యాహ్నం నుంచీ ఒకటే గొడవ— 'పాపం! ఇంకా అచ్చమ్మ ఏడుస్తూనే వుంది మమ్మీ. అచ్చమ్మ కోడిలాంటిదే కొని యిచ్చేద్దాం' అని ముగ్గురూ ముగ్గురే— చెప్పితే అర్థం చేసుకోలేని వయసు. మొత్తానికి రంగన్నతో బజారుకి పంపేదాకా వేపుకు తిన్నారు. అలాంటి కోడి లేదట. వచ్చేశారు. 'రేపు సంత. నేను చూసి పట్టుకు వస్తాలెండి' అని రంగన్న చెప్పాక విశ్రాంతిగా పడుకున్నారు" అంది టేబుల్ సర్దుతూ.

నిశ్చలంగా, నిర్మలంగా నిదురిస్తున్న ఆ అమాయక వదనాలను చూస్తూ అలానే నిదురపోయాను.

* * *

నేను సాయంత్రం ఆఫీసు నుంచి వచ్చేసరికి పిల్లలు ముగ్గురూ పరిగెత్తుకొంటూ వచ్చి, ఎంతో ఆనందంగా నన్ను చుట్టుముట్టారు.

"డాడీ! డాడీ! అచ్చమ్మ కోడి దొరికింది. అచ్చమ్మకిచ్చివేశాం" అని ముగ్గురూ ఒకేసారి అన్నారు సంతోషంగా.

"మరేమో రంగన్న సంతకు వెళ్ళాడట. అచ్చు మన అచ్చమ్మ కోడిలానే వుంది డాడీ! ముప్ఫయి రూపాయలకుగాని అమ్మనంటే, ముప్ఫయి ఇచ్చి తెచ్చాడట" అంది సుధ.

"మమ్మీ రంగన్నకి ముప్ఫైరూపాయలు ఇచ్చేసిందిలే" అంది కవిత.

"కోడి ఎప్పుడు వచ్చిందో? ఎలా వచ్చిందో ఏమో. మన గార్డెన్‌లోనే వుందని చెప్పి రంగన్నని అచ్చమ్మకి యిచ్చివేయమన్నాం డాడీ" అన్నాడు సాగర్

"ఈ రెండు రోజుల నుంచీ అచ్చమ్మ గెంజి కూడా తాగలేదట డాడీ! రంగన్న కోడిని యిచ్చాక ఎంతగానో సరదాపడి పోయింది. మేం కూడా చూశాం డాబామీద నుంచి" అన్నారు పిల్లలు.

ఆ అమాయకుల మాటలు వింటుంటే

చాలా ఆనందం వేసింది. వారి నిర్మలమైన అంతఃకరణకు ఆశ్చర్యం చెందాను.

"సరే! ఈ పేళ పార్కు కన్నారుగా! పదండీ." అని మా ఆవిడతోపహా సరదాగా నడచి బయలుదేరాం.

"ఏఁవే అచ్చమ్మా! నీ కోడి పోయినా దట కదూ....? దొరికిందా?!" రోడ్డువారగా అచ్చమ్మను ఎవరో పలకరింపు.

"ఆ....! ఆ భగవంతుని దయవల్ల దొరికి నాది. భగవంతుడేంటిలే మన రంగన్న దయవల్ల దొరికినాది."

"అదేంటీ..? ఎక్కడుండీ...??"

"మా ఎదురింటిలోనే వున్నాది. రెండు రోజులుగా నే తిట్టిన తిట్లు, శాపాలకు భయ మేసిందో యేమో? రంగన్నకిచ్చి పంపే శారు. పెద్ద మనుసులయితే మాత్రం బుద్దులు పెద్దగా వుంటాయేంటీ ...? అయినా, ఈ ఇంట్లోకి ఎవరు దిగినా ఇంతేనే తల్లీ.... రంగన్న ఉండబట్టికానీ, ఎన్నిసార్లంటావ్ ఇలాగ!"

ఇదంతా విని నీరుగారిపోయాం నేనూ, మా ఆవిడ. నీరు నిండిన కళ్ళతో ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ ఆగిపోయిన పిల్లలు "ఇంటికి పోదాం డాడీ" అంటూ నన్ను వెనక్కి లాగారు. వారి అమాయక హృదయాలకు తగిలిన గాయం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది ఆ లేత ముఖాలలో.

పైలా పచ్చీసుగా సెంటు కంపు కొడుతూ పోతున్న రంగన్నను చూసేటప్పటికి అసలు విషయం బోధపడింది నాకు.

అయితే, రంగన్నొక్కడే ఈ పని చేస్తున్నాడో, లేక ఈ నాటకంలో అచ్చమ్మ క్కూడా పాత్రుందో మాత్రం ఇప్పటికీ బోధపడలేదు నాకు!

ఆనందచంద్రిక

## ఉన్నది ఒకటే దీపం — అది కాస్తా కొండెక్కనియ్యకు

ఆడపిల్లల ప్రేమని అపారంగా చూరగొన్నవాడు శ్రీకృష్ణుడు (అదంతా కథల్లోనే అనుకోండి). ఆయనను అపారంగా ప్రేమించిన ఆడపిల్ల రాధ. ప్రపంచం మొత్తం మీద రాధ ఒక్కతే నిజమైన ఆడపిల్ల. మిగిలిన వాళ్ళు కూడా కొంతవరకూ ఆడపిల్ల లయితే కావచ్చు, కాని రాధలాంటి ఆడపిల్ల మాత్రం లోకంలో మరి లేదు.

అందుకే దూతిక అంటోంది కృష్ణుడితో :

చక్రే చంద్రముఖే ప్రదీప కలికా ధాత్రా ధరామండలే
తస్యా దైవ వశాత్ దశాపి చరమా ప్రాయస్య మున్మీలతి।
తద్బ్రూమః శిరసా నతేన సహసా శ్రీకృష్ణ నిక్షిప్యతాం
స్నేహ స్తత్ర తథా యథా న భవతి త్రైలోక్య మంధం తమః ॥

శ్రీకృష్ణా ఈ భూమికి అంతటికీ ఒకే ఒక దీపాన్ని బ్రహ్మదేవుడు వుంచాడు. చంద్రుడిలాంటి ముఖం గల రాధయే ఆ దీపం. ఆ దీపపు వత్తి ప్రస్తుతం ఆఖరి దశలో ఉంది (నూనె లేక). అందుచేత శిరసాగ్గి విన్నవించుకుంటున్నాం. అది కాస్తా కొండెక్కు ముల్లోకాలూ చీకటిలో మునిగిపోక ముందే కొంచెం తొందరగా స్నేహం (నూనె) పోసి దీపాన్ని నిలపవయ్యా.

అంటే నీవు స్నేహాన్నీ ప్రేమనీ అందించకపోతే రాధ అనే దీపం కొండెక్కి పోవడం ఖాయం. అప్పుడు లోకం కటిక చీకటి అయిపోవడం కూడా ఖాయం అని తెలియజేస్తోంది.

—సౌభరి

